# మహాసంకల్పం

## గెలీలియో

ఆ మహానగరంలో ఓ చిన్న ఇంటిలో ఓ గదిలో, ఓ మూల, గోడకానుకుని, జేరగిలబడి కూచుని వుంది ఓ తల్లి.

గదిలో గోరంత వెలుగన్నా లేదు.

ఉన్న ఒకే ఒక దీపం వారం కిందటే కిరసనాయిలు లేక ఆరిపోయింది. ఆరిన దీపం వత్తి కాలి నుసై మిగిలింది.

చీకటి -

గది నిండా -

తల్లి మనసు నిండా.

గదిలో చీకటి, రాత్రుళ్ళు మాత్రమే. పైగా వారం కిందటి వరకూ బుడ్డి దీపం వెలుగన్నా వుండేది.

ఆమె మనసు నిండా చీకటి.

ఆరు నెలలుగా రాత్రీ పగలూ చీకటి.

ఈ రాత్రి మాత్రం కటిక చీకటిగా వుంది.

ఇంత చీకట్లోనూ ఆ తల్లి దిగులుగా, వంటరిగా.....

ఆరు నెలల క్రితం ఈమెకి నలభై అయిదేళ్ళే.

ఇప్పుడు డెబ్బయ్ వచ్చాయి.

దిగులూ, దుఃఖమూ కలిసి ఆమెను అకాల వార్ధక్యంలోకి నెట్టాయి.

పీక్కుపోయిన కళ్ళు.

కన్నీళ్ళ వల్ల రెప్పల కింద నలుపెక్కిన చర్మం.

సన్నగా, ప్రాణం లేని అస్థి పంజరంలా ఒళ్ళు.

ఆరు నెలల క్రితం ఆమె ఇట్లాలేదు.

ఆమెకు వారం నుంచీ ఒకటే దిగులు.

గుండె నిండా, ఆలోచనల నిండా సుళ్ళు తిరుగుతున్న దుఃఖం.

ఇవ్వాళ ఆ దిగులూ, దుఃఖం తీవ్రమై నిశ్శబ్దంగా మారిపోయాయి. ఇంక దిగులూ,

దుఖ్ఖమూ లేవు. ఉన్నదల్లా మవునం.

చీకట్లో, నిశ్శబ్దంలో వంటరితనంలో సాయంత్రం ఆరు గంటల్నించీ ఆమె ఈ గదిలో కూలబడి వుంది.

ఇప్పుడు రాత్రి పన్నెండు దాటుతోంది.

ఆ గది నిశ్శబ్దంలో ఆరు గంటలు.

ఆ నిశ్శబ్దపు చీకట్లో ఆరు గంటలు.

ఆరు గంటల నుంచీ ఆమె ఆరునెలల విషాదంలో వుంది.

ఇప్పుడు పన్నెండు గంటలు.

మరో నాలుగున్నర గంటల్లో ఆమె కొడుకుని ఉరి తీస్తారు.

సాయంత్రం ఆరింటికి అనుకుంది. -

"ఇంకా పదిన్నర గంటల్లో ఉరి తీస్తారు."

ఆమె చీకట్లో కూరుకుపోయినా, ఆమె ఆలోచనలు నిశ్శబ్దంలో కల్సిపోయినా ఆమెకు గుర్తున్నది మళ్ళీ మళ్ళీ గుర్తొస్తున్నది ఒక్కటే -

" తన కొడుకుని తెల్లార గట్ట నాలుగున్నరకి ఉరి తీస్తారు."

ఆమె మెదడు నిండా ఆలోచనలు.

ఆలోచనల నిండా జ్ఞాపకాలు.

## 2

డిసెంబర్ చలిలో ఓ రాత్రి వణుక్కుంటూ యింటి కొచ్చాడు.

ఎంత చలివున్నా రోజూ పెద్ద లైబ్రరీకి వెళ్ళడం, అర్ధరాత్రి పన్నెండు గంటలకి, అది మూసాక మైలున్నరా నడిచి ఇంటికి రావడం మామూలే.

ఆ రోజు ఒంటి మీద చొక్కాలేదు.

తను అడిగింది.

ఎవరికో ఇచ్చేసానన్నాడు.

ఆశ్చర్యపోయింది.

"లైబ్రరీ దగ్గర ఒక ముసలతను చలికి వొణుకుతుంటే ఇచ్చా."

ఇంక తనేమీ మాట్లాడలేదు. తనకు తెలుసు కొడుకు తత్వం. పేదవాళ్ళన్నా, దిక్కులేని వాళ్ళన్నా ఎంత ప్రేమో!

ఏ రోజన్నా ఏ దృశ్యమన్నా తనని బాధిస్తే ఆ సంగతంతా చెప్పేవాడు.

తన బలవంతం మీద అన్నం దగ్గర కూచున్నాడేగాని సరిగా తిన్నేలేదు. తను వాడి దిగులు పోగొట్టాలని చాలా ప్రయత్నించింది. చాలా మాట్లాడింది.

" ఏం బతుకులో ఏమిటో! పాడు బతుకులు, తినడానికి తిండివుండదు. ఇల్లుండదు. వాకిలుండదు. ఏం బతుకులో ఏమిటో? ఏం చెయ్యగలం?"

తన మాటలకి మరీ దిగులు పడ్డాడు. ఫుట్‌పాత్‌ల మీద చలిలో ముడుచుకుని ఎట్లా

పడుకుంటారో చెబుతూ, చెబుతూ ఏడ్చేశాడు. తను ఎంత వోదార్చినా ఏడుపు ఆపుకోలేదు. అంత సున్నితం వాడి మనసు.

3

ఈ చీకటి రాత్రి ఆ తల్లికి మెదడు లోంచీ, నర నరంలోంచీ వణుకు పెట్టించే దుఃఖం.

పేదవాళ్ళనీ, అభాగ్యుల్నీ చూసి తలడిల్లే తన కొడుకుని ఉరి తీస్తారంటే ఆమెకంతా అయోమయంగా వుంది.

పుట్టెడు దిగుల్తో, నిరాశతో నిండిన మవునం లోంచి ఆ తల్లి అనుకుంది.

"ఇవ్వాళే.... ఇంక ...... ఉరితీస్తారు."

4

ఆ రోజు సాయంత్రం చీకటి పడుతున్నప్పుడు తన భర్త తూలుకుంటూ ఇంటికొచ్చాడు.

వచ్చినప్పటి నుంచే నోటికొచ్చినట్లు ఏదో వాగుతూనే వున్నాడు. నోరు విప్పితే చాలు ఇల్లంతా గుప్పుమంటోంది.

ఇంక పోట్లాటేసుకున్నాడు.

వంటింటోకెళ్ళి పీట వాల్చుకుని "ఏం కూరే" అన్నాడు. తను మాట్లాడకుండా పచ్చడేసి అన్నం పెట్టింది. విసిరి కొట్టాడు. మాంసం వండలేదేం అని చిందులు తొక్కాడు.

తను వూరుకోలేదు.

"నువ్వు రోజూ డబ్బులన్ని తగలేసి ఇట్లా తాగొస్తే మాంసాలూ, చేపలూ ఎక్కణ్నించి తెచ్చిపెట్టి వండను?" అని కోపంగా అంది.

తనకి నిజంగానే కోపం వచ్చింది. అతనికొచ్చే జీతం ఇంటిక్కూడా తీసుకు రాకుండా హారతి కర్పూరం చేస్తాడు.రోజూ తప్పతాగొచ్చి "అదొండు,ఇదొండు, పావలా ఇయ్యి, అర్ధియ్యి –" అని కాల్చుకు తింటాడు.

తనేమో ఫ్యాక్టరీలో రోజల్లా రెక్కలు ముక్కలు చేసుకొని తెచ్చే కూలి డబ్బులు ఎంత జాగ్రత్తగా వాడినా ఆ వచ్చేదాంతో ఇల్లు గడవడం కష్టమైపోతుందయ్యే!

అందుకే ఏవన్నాగానీ అని తను ఎన్నడూ లేనంత కోపంగా ఆనాడు జవాబిచ్చింది.

దాంతో పిచ్చి కోపంతో పీట తీసుకుని నడుం మీద కొట్టాడు. అట్లా ఒకసారి కాదు, రెండుసార్లు కాదు. తను కేక లేస్తూ ఏడుస్తోనే వుంది. నోటికొచ్చిన బండబూతులన్నీ తిట్టి బాత్తోనే వున్నాడు.

అంతలో అప్పటి వరకు బయట గుమ్మం దగ్గర నిలబడున్న కొడుకు లోనకొచ్చాడు. వచ్చి రావడం తోటే తండ్రి మీద కలబడి, పీట లాక్కుని విపరీతమైన కోపంతో తండ్రిని కొట్టడం మొదలుపెట్టాడు.

కొంత సేపటికి ఇరుగుపొరుగువాళ్ళూ, తనూ కలగజేసుకొని వాణ్ని ఆపారు.

తనకి చాలా ఆశ్చర్యం వేసింది ఆరోజు. తీరాచూస్తే వాడివయసెంత?

పధ్నాలుగేళ్ళే!

తనని భర్త కొట్టటం, తిట్టటం ఆ వేళ కొత్తేంకాదు. వూహవచ్చినప్పట్నుంచీ చూస్తోనే వున్నాడు. చిన్నప్పుడు తనను కావిలించుకుని బావురుమనేవాడు.

భర్త బయటికి వెళ్ళిపోగానే కొడుకుని దగ్గర కూచోపెట్టుకుని ఏడ్చేది. వాడూ ఏడ్చేవాడు.

తను కొడుకు మీద ఎన్ని ఆశలో పెట్టుకుంది. కొడుకు తొందరగా పెద్దవాడై ఏదన్నా ఉద్యోగంలో చేరితే భర్త దారి నుంచే బయటపడి కొడుకుని చూసుకుంటూ తను సుఖంగా వుండొచ్చని కలలుకంది.

కొడుకు తండ్రిలాంటివాడు కాకూడదని ఎన్నిసార్లో అనుకుంది. ఓసారి అడిగింది -

"ఏరా, పెద్దయ్యాక పెళ్ళిచేసుకుని పెళ్ళాన్ని ఇట్లాగే కొడతావేరా?"

"ఛీ! నేనసలు కొట్టనేకొట్టను" - అన్నాడు. అటువంటివాడు తన కడుపున పుట్టాడని మురిసిపోయింది.

## 5

ఆ కొడుకునే

అవును.

వాడినే!

ఆ పధ్నాలుగేళ్ళ కొడుకుని మరో పదేళ్ళు పెంచనిచ్చి, పెరగనిచ్చి ఇప్పుడు వురి.

ఉరితీస్తారు, ఇంక.

తల్చుకుంటే అణువణువూ భయంతో, దిగులుతో ముడుచుకుపోతోంది.

ఉరి.

తన కొడుక్కి,

తన రక్తంలోంచి పుట్టిన తన బిడ్డడిని ఉరితీస్తారు.

ఉరి.

ఇంకో మూడుగంటల్లోనే.

## 6

"అమ్మా అయిదింటికిలేపు. పొద్దున్నే లేచి హాస్టళ్ళకి వెళ్ళాలి" - అన్నాడు పక్కమీద పడుకుంటూ.

అట్లా అన్నాడేగాని అప్పటికే రెండుదాటింది, తను రోజా మొత్తుకుంటూనే వుంది -

" పెందలాడే ఇంటి కొచ్చెయ్యరా. వేళకి ఇంత తిను, శుభ్రంగా చదువుకో. రోజా పన్నెండూ, ఒంటిగంట అయితే ఎట్లా? నీ ఆరోగ్యం ఏంగానూ, నీ చదువు ఏంగానూ?" అని గోలపెడుతూనే వుంది.

రెండు మూడు రోజులయ్యేక అసలు సంగతి చెప్పాడు.

హరిజనుల పిల్లలు చదువుకొనే హాస్టళ్ళలో పరిస్థితులు ఏమీ బాగా లేవంట. కుళ్ళిపోయిన కూరగాయలతో కూరలూ, ముక్కిపోయిన బియ్యంతో అన్నం, నీళ్ళ చారూ పెడతారు. ఆ పెట్టేది కూడా పిడికెడు, పిడికెడు..... ఒక్కొక్క గదిలో పదిమందినో, పదిహేనుమందినో కుక్కుతారంట.

హాస్టళ్ళలో వందమంది వుంటే ఒకటే లెట్రిన్, ఒకటే నీళ్ళ పంపు. ఈ సమస్యలు పరిష్కరించాలని హాస్టళ్ళలో వాళ్ళంతా సమ్మె చేస్తారంట.

సమ్మెలూ, ఊరేగింపులూ అనగానే తనకి చాలా భయంవేసింది. కొడుక్కి నచ్చచెప్పాలని చూసింది. చివరికి తనకే నచ్చచెప్పాడు.

ప్రభుత్వం సమస్యలు సృష్టించినప్పుడు కదలకుండా కూచుంటే ఇంకా నెత్తికెక్కుతుందని చెప్పాడు. సమ్మె చేయాల్సిన అవసరం ఏమిటో చెప్పాడు.

ఆ వారం రోజులూ, రాత్రీ పగలూ ఇల్లు పట్టకుండా తిరిగాడు. తనకి ఆసక్తి పెరుగుతూండేది.

"ఇవ్వాళేం జేసార్రా?" అని అడిగేది. ఎప్పుడో ఓసారి భోజనానికి వచ్చినప్పుడు "నిన్నటిదాక హరిజన విద్యార్థులుండే హాస్టళ్ళకే వెళ్ళాం గదా? ఇవ్వాళ కాలేజీలకి వెళ్ళాం. అక్కడ హరిజన హాస్టళ్ళలో వుండని విద్యార్థుల్ని కలిసాం. క్లాసు క్లాసుకీ వెళ్ళాం. ప్రతి విద్యార్థినీ కలిసాం. కరపత్రాలు పంచాం. విషయం చెప్పాం."

"ఇవాళ ఒక స్టూడెంట్ ఏమన్నాడంటే హరిజనులకేమి సమస్యలండి? వాళ్ళ గురించి ఇంత గొడవ జేస్తున్నారెందుకూ? గవర్నమెంటు వాళ్ళకి సాయం చేస్తున్నామంటోందిగా? అన్నాడు. అప్పుడు మేం చెప్పాం. 'దేశం మొత్తం మీద వున్న హరిజనులు ఎంత పేదరికంతో వున్నారో, సాంఘికంగా ఎన్ని అవమానాలకు గురవుతున్నారో అంతా వివరించి చెప్పాక, నిజమేనండి అట్లా అడిగినందుకు ఏమీ అనుకోవద్దు' అన్నాడు."

"ఇవాళ చాలా మంది చాలా ఉత్సాహం చూపారమ్మా, తప్పకుండా సమ్మెచేయాలి. మంత్రులూ; కలెక్టరూ చర్చ అని చెప్పి మోసం చేద్దామని చూస్తారు. వాళ్ళు దొంగలు. వాళ్ళేసే ఎత్తులకి లొంగొద్దు. న్యాయమైన పరిష్కారం జరిగేవరకూ సమ్మె నాపొద్దు. అన్నారు" అని ఏవేవో చెప్పేవాడు.

చివరికి సమ్మెరోజు రానేవచ్చింది.

ఆరోజు సాయంత్రం సమ్మె కబుర్లు ఏం వుంటాయోనని కొడుకుకోసం ఎదురు చూస్తోంది. అంతలో కొడుకు స్నేహితుడు వచ్చి - 'మీ అబ్బాయిని అరెస్టు చేశారండీ' - అని చెప్పాడు.

అరెస్టనగానే గుండెలో వణుకు మొదలైంది.

"ఎక్కడున్నాడూ?" అని కంగారుగా అడిగింది తను.

" ఒక్కడేకాదు. ఇంకా పధ్నాలుగు మంది ఉన్నారు. ఏం ఫరవాలేదు, మీరు కంగారు పడకండి."

అరెస్టంటే మాటలా? ఏ పాపం ఎరగని వాళ్ళను కూడా తీసికెళ్ళి నానా బాధలూ పెడతారు. నిన్న మొన్న తన కళ్ళారా చూసింది. ఏదో కొట్లాటలో వున్నాడనీ చెప్పి సుబ్బమ్మ కొడుకుని తీసికెళ్ళి నానా హింసలూ పెట్టారు. అసలా పిల్లవాడికి కొట్లాటతో సంబంధమేలేదు. అప్పుడతను పరీక్షలుకూడా రాస్తున్నాడు. తల్లీ తండ్రీ నెత్తీ నోరూ బాదుకుని ఎంత చెప్పినా విన్లేదా పోలీసులు.

అయితే వీళ్ళందర్నీ అలాగే కొడతారా? అన్ని హింసలూ పెడతారా? ముక్కిపోయిన

బియ్యం ఆరోగ్యం కాదనీ, కుళ్ళిన కూరగాయలు తినొద్దనీ ఎవరైనా అంటారే, అలా అంటేనే అరెస్టా? అని కోపం వచ్చింది.

"మరి సమ్మె ఏమయింది?" - అని అడిగింది.

"మేమంతా ఊరేగింపుగా కలెక్టరాఫీస్ దగ్గరికి వెళ్ళాం. తీరా వెళ్ళి మెమోరాండం ఇద్దామనుకుంటే తను రాకుండా వేరే మనిషిని పంపాడు. కలెక్టర్ రావాలని మేం నినాదాలిచ్చాం. పోలీసులొచ్చి ఇష్టం వొచ్చినట్లు బాది చెల్లా చెదురు చేశారు."

7

ఆ రోజు హరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించమని ప్రభుత్వాన్ని కోరితే లాఠీ దెబ్బలు.

ఇవ్వాళ..... ?

ఇవ్వాళ ఉరి శిక్ష.

ఉరి.

ఇంకో రెండున్నర గంటల్లో తన కొడుకుని ఉరి తీస్తారు.

ఉరి. ఇది తల్చుకున్న ప్రతి క్షణం ఆమె ఊపిరి దుఖ్ఖ భారంతో కుంగిపోతోంది. కంఠంలోంచి సన్నని ఏడుపు.

విషాదంతో పీక్కుపోయిన కళ్ళలోంచి జలజలా కన్నీళ్ళు.

8

కొన్ని రోజులు వరుసగా చైనా నవల ఒకటి చదివి వినిపించాడు. ఆ రాత్రి దాని గురించి ఎంతసేపో మాటలాడుకుంటూ కూచున్నాం.

చైనాలో భూస్వాములూ, జపాను సామ్రాజ్యవాదులూ ప్రజల్ని పీడిస్తోంటే గొప్ప ఉద్యమం ప్రారంభమైంది. ఆ విప్లవంలో ఎన్ని కుటుంబాలో ఆహుతయ్యాయి. ఒక కుటుంబం కథ అది. భర్తా, పిల్లలూ విప్లవం కోసం చచ్చిపోయినా సరే - ఆ స్త్రీ వెనుకాడలేదు. మిగతా పిల్లల్ని ప్రోత్సహించింది. తనూ పాల్గొంది.

అది చదివి వాడెంతో కదిలిపోయాడు. తనకీ చాలా నచ్చింది.

"అమ్మా! ఈ నవల్లో వున్న తల్లి ఎట్లాంటామో చూశావా?" - అని చాలా గౌరవ భావంతో అన్నాడు. తను అంది -

"అవును నిజమే. ఇట్లాంటి తల్లులు నూటికీ కోటికీ ఒకరుంటారు.... ఎక్కడో దాకా ఎందుకు? నా మట్టికి నన్ను చూడు. నువ్వు సమ్మెలోకి వెళ్తుంటే ఎంత ఆపాలని చూస్తాను? ఇంక పెద్ద పెద్ద ఉద్యమాలొస్తే ఏమంటానో కదా?"

"అట్లా ఎందు కనుకోవాలమ్మా? మనం - 'ఇదిగో, పని మంచిది. ఈ ఆదర్శం గొప్పది. దీన్ని మనం ఎన్ని కష్టాలొచ్చినా విడవకూడదు' - అనుకుంటే ఏముందమ్మా? చైనాలో విప్లవం జరిగినప్పుడు ఈ నవల్లో వున్న ఒక్క తల్లే కాదమ్మా' అనేకమంది తల్లులు ఇంత చైతన్యంతోనూ వున్నారమ్మా."

ఆ నవల తన మీద చాల పని చేసింది. తన ఆలోచనల్లో ఓ మార్పుని తెచ్చింది. అప్పట్నించీ ' ఆ తల్లి' తన మనసులో ఎప్పుడూ మెదుల్తుండేది.

తన కొడుకు అప్పుడప్పుడూ కొన్ని పుస్తకాలు చదివి వినిపించేవాడు.

తన జీవితంలో స్త్రీగా తనెన్ని కష్టాలు పడిందీ, ఇతర స్త్రీలు ఎట్లాంటి బాధలు అనుభవిస్తున్నదీ చర్చించి వీటన్నిటినీ లేకుండా ఎట్లా చేసుకోవచ్చో వివరించి చెప్పేవాడు.

భూస్వాముల చేతుల్లో భూము లెక్కువగా వుండడానికీ, పేదల కష్టం మీద వాళ్ళు బతకడానికి, స్త్రీలని బలహీనంగా చూడ్డానికీ సంబంధం వుందంటే మొదట్లో తను చాలా ఆశ్చర్యపోయింది. పోను, పోను కొంచెం కొంచెం అర్థమయ్యింది. భూస్వాముల దోపిడిని మొత్తం నిర్మూలిస్తే అన్నిటితోపాటు స్త్రీలకు జరిగే అన్యాయాలు కూడా ఎట్లా పోతాయో చైనా చరిత్రలోంచి ఎన్నో సంఘటనలు చెప్పేవాడు.

ఆరోజు రాత్రి ఆ చైనా నవల చదివినాక, మాటల్లో తెలంగాణాలో పాతికేళ్ళనాడు భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం గురించి చెప్పాడు.

"అప్పుడమ్మా! కూలీలూ, పేద రైతులూ అంతా లక్షలకొద్దీ ఎకరాలు పంచేసుకున్నారు. వేలాది గ్రామాల్లో భూస్వాముల రాజ్యం తీసేసి పేదవాళ్ళ రాజ్యం నడుపుకున్నారు. ఇట్లా ఒక అయిదేళ్ళు జరిగిందమ్మా! కాని, తర్వాత.... "

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడు.

అట్లాగే కూచుని తను కేక వేసింది –

"ఎవరూ?"

మళ్ళీ శబ్దం.

తీరా, తలుపు తెరిచేసరికి ముగ్గురు పోలీసు ఇనస్పెక్టర్లూ, పదిమంది పోలీసులూ ఇంట్లోకొచ్చేసి అంతా వెతకటం మొదలెట్టారు.

"ఏమిటండి మీకేం కావాలి.... అరె, సామానంతా ఇట్లా చిందర వందర చేస్తారే" అని తను చాలాసార్లడిగింది.

ఇద్దరు ఇనస్పెక్టర్లు కొడుకుని గట్టిగా పట్టుకుని బయట వ్యానులో ఎక్కించారు.

ఇంకో ఇనస్పెక్టరు ఇల్లంతా వెతికి వెతికి చివరికి ఎర్ర అట్ట పుస్తకాలన్నీ తీసికెళ్ళాడు. వాటితోపాటు పక్కింటివాళ్ళబ్బాయి వొదిలెళ్ళిన ఎక్కాల పుస్తకం కూడా తీసుకెళ్ళారు, దానికి ఎర్ర అట్టవుందని.

తను వెంటబడి మరీ అడిగింది. బతిమిలాడింది.

"ఎందుకట్లా మా అబ్బాయిని తీసుకెడుతున్నారు?" అని పదే పదే అడిగింది.

"రేపొద్దున పంపిస్తాంలే" అని ఒకడూ,

"ఎందుకా? స్టేషన్‌కిరా చెబుతాం" – అని ఒకడూ వెటకారాలు చేసి వెళ్ళారు.

9

అప్పుడు తన కొడుకు ఏం చదవాలో, ఏం చదవకూడదో దౌర్జన్యంతో శాసించారు.

ఇప్పుడు ఎంతకాలం ప్రాణంతో వుండాలో శాసిస్తున్నారు.

ఇంకా -

రెండుగంటల్లోనే ఉరి.

ఆ రోజున -

ఒక పౌరుడిగా తన కొడుక్కి వున్న హక్కు మీద దాడిచేసినవాళ్ళే ఈ రోజున -

తన కొడుక్కి ఒక జీవిగావున్న ప్రాణహక్కు మీద దాడిచేస్తున్నారు.

అవ్వాల్టి దాడి దౌర్జన్యం.

ఇవ్వాల్టిదాడి అమానుషం.

చైతన్యంతో బతికే మనుషుల జీవితాల్ని దౌర్జన్యంతో శాసిస్తున్న పోలీసులు తలపుకురాగానే కోపంతో వూగిపోయింది ఆమె.

కాని, మరుక్షణమే నిస్సహాయత్వంతో, బాధతో కుంగిపోయింది ఆమె కోపం.

కళ్ళలో నీళ్ళు.

కంఠంలో మూలుగు.

ఉరి.

ఇంకో రెండు గంటల్లో.

## 10

ఒకరోజు ఎనిమిదీ, ఆ ప్రాంతాల్లో ఇంటికొచ్చాడు. వచ్చీ రావడంతోనే వున్న నాలుగు బట్టలూ సర్దుకుంటూ -

"మొన్నామధ్య చెప్పాగదమ్మా ఊళ్ళవైపు వెళ్ళాల్సి వస్తుందనీ....."

ఆ విషయం రోజూ ఇంటో నలుగుతున్నదే. అంతకు ముందురోజు కూడా ఇద్దరికీ మాటలు నడిచాయి.

కొడుకు ఆలోచించే పద్ధతీ, అదీ, అంతా తనకి నచ్చుతాయి.

అతని యమ్మేచదువు మధ్యలో ఆగిపోతోందే అనే దిగులులేదు.

కాని, అతను అట్లా ఉద్యమాల్లోకి దూకటం అదీతల్చుకుంటే భయమేస్తోంది.

అతనికేం ముప్పువస్తుందో, అతన్ని ఎన్ని చిత్రహింసలకి గురిచేస్తారో అనే వూహలతో తను చాలా భయపడింది.

వెళ్ళొద్దని నచ్చ చెప్పాలని చూసింది. "అమ్మా! ప్రజలకెన్ని సమస్యలున్నాయో చూడు. వాటికన్నిటికీ ఈ దోపిడీ సమాజమే కారణం అని తెల్సుకదా. మరి సమాజాన్ని మార్చాలంటే ఇంటో కూచుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటే సరిపోదుగదా? ..... మరి ఇట్లా వెనకా, ముందు ఆడితే ఎట్లా?" అని చాలా నచ్చ చెప్పే ధోరణిలో అన్నాడు.

"నిజమేరా! కాని నీకేం ప్రమాదం వస్తుందోననే నా బెంగ"

"అమ్మా! ఒకరో, ఇద్దరో కాదు కదమ్మా ఉద్యమంఅంటే. అందరూ కదిలిందే ఉద్యమం. ప్రజలందరూ కదుల్తారు. నువ్వూ కదలాలి. నేనూ కదలాలి - ఇంక ప్రమాదాలంటావా? మనం

కావాలని ప్రమాదాలు తెచ్చుకుంటామా? మన శత్రువులే మనకి ప్రమాదం.

కొడుకు ఎన్నో చెప్పాడు. అన్నీ నిజమే అనిపించాయి. అయినా, ఇంకా దిగులుగానే వుంది.

"ఇక్కడేవుండి ఆ పనులేవో చూసుకోరాదూ?"

"ఇక్కడి విషయాలు చూసుకోడానికి వేరే వాళ్ళున్నారు. తప్పనిసరిగా నేనింకో వూరికి వెళ్ళాల్సిన అవసరం వచ్చింది... అయినా, ఉద్యమం అవుసరాన్ని బట్టి మనం పనిచెయ్యాలిగాని, మన పరిస్థితుల్నిబట్టి కాదుగదా?"

విషయాలు ఎంతబాగా అర్థమైనా తను మాత్రం కొడుకు వెళ్ళిపోతోంటే దిగాలుపడి పోయింది.

11

సమస్యలకూ, అన్యాయాలకూ కదిలి పేద ప్రజలకోసం, అన్నీవిడిచి జీవితాల్నీ, లోకాన్నీ, మార్చే ఉద్యమంలోకి దూకిన తన కొడుక్కి ఉరి శిక్షా?

ఉరి.

ఇంకో గంటన్నరలో.

12

ఆ రాత్రి వెళ్ళిన కొడుకుని మళ్ళీ అలా చూస్తాననుకోలేదు, తను.

కొడుకు చేతుల్నలా విరగదీసి కట్టారేం?

అవును. అలానే కట్టేస్తారు.

తనకు తెలుసు.

తన కొడుకు చెప్పాడు.

పోలీసుల పనే అది.

పేదల కష్టంమీద బతికే "పెద్ద మనుషుల" కిరాయి గుండాలు ఈ పోలీసులు.

వీళ్ళిట్లా చేతులు కట్టేసి తుపాకుల్తో కాపలా కాసినందుకు కిరాయిస్తారు.

ఆ కిరాయి కూడా పేదవాళ్ళ నోళ్ళు కొట్టే సంపాదిస్తారు.

ఈ కిరాయి గుండాలు పెద్దల శాంతి భద్రతలు కాపాడే రక్షకభటులు.

పేదలు తిరగబడినప్పుడు "పెద్దల" "శాంతి" ని కాపాడతారు.

"పెద్దవాళ్ళు" పేదవాళ్ళ నోళ్ళు కొట్టి సంపాదించిన దాన్ని భద్రపరుస్తారు.

ఆమె చూసింది. తన కొడుకు చుట్టూ పోలీసులు.

అందరి చేతుల్లోనూ తుపాకులు.

ఆ తుపాకుల్దే రాజ్యం.

ఆ మధ్య వీధిలో, లోగడ, ఓ గోడ మీద చూసింది తను.

"ఇదేమి రాజ్యం!

ఇదేమి రాజ్యం!

పోలీసు రాజ్యం!

తుపాకి రాజ్యం!

తుపాకుల మధ్యనించీ వస్తూ కొడుకు తనని చూసాడు. తనవేపే వస్తున్నాడు.

తను కొడుకువైపు నడిచింది.

అడ్డంగావున్న పోలీసులు, అర్థంకాని మాటతో తప్పుకొన్నారు.

ఇప్పుడు ఇద్దరిచుట్టూ పోలీసులు.

తుపాకుల మధ్యలో తామిద్దరూ.

కొడుకు, నవ్వు మొహంతో తనవంక చూశాడు.

అతని కళ్ళలో నిర్భయత్వం.

తను దుఖ్ఖంతో కొడుకువంక...

కొడుకు నుదుటిమీద మచ్చలు. అంతకుముందు ఎన్నడూలేని మచ్చలు.

పోలీసుల సంగతి కొంచెంగా తెలిసిన తను, అవి కాలిన మచ్చలు అనుకోలేకపోయింది. అవి కాల్చిన మచ్చలే అనుకుంది.

దుఖ్ఖం ఆపుకోలేక పోయింది.

బావురుమని ఏడ్చింది.

పక్కకిలాగి, కొడుకుని తీసుకుపోయాయి తుపాకులు, కోర్టుగదిలోకి.

బోనులో నిలబెట్టారు.

ప్రశ్నలడిగారు.

ఆరు నెలలు అడిగారు.

చివరికి -

ఒకరోజున తేల్చారు.

తన కొడుకు -

"ఒక పేదరైతుని చంపాడు!"

"పదముగ్గుర్ని బరిసెలతో పొడిచాడు."

"ఒక మాలపల్లిని తగలబెట్టాడు."

"ఒక హరిజన స్త్రీని బలాత్కరించాడు."

మొత్తం పందొమ్మిది కేసులు పెట్టారు.

పేదల పక్షాన నిలబడ్డ వ్యక్తికి ఉరిశిక్ష.

పేద రైతులబాగుకోసం అన్నీ వదులుకొనీ, జీవితాన్నే ఉద్యమంలో కలిపిన కొడుకు ఓ పేద రైతుని చంపుతాడా?

మాలపల్లిలో కూలీల్తో కలిసి బతుకుతూ, వాళ్ళు తినే గొడ్డుకారమ్మెతుకులే తింటూ వాళ్ళలో ఒకడిగ వుంటున్న తన కొడుకు మాలపల్లిని తగలబెడతాడా? తన ఇంటినే తను తగలబెట్టుకుంటాడా?

స్త్రీల మీద పురుషులు చేసే దౌర్జన్యాన్ని సహించని తన కొడుకు ఓ స్త్రీని బలాత్కరిస్తాడా?

ఇవన్నీ కోర్టులు నమ్ముతాయి. తను నమ్మదు.

తన కొడుకుని తెలిసిన మరెవ్వరూ నమ్మరు.

తన కొడుకు ఆ ప్రాంతం భూస్వాముల పొలాల్లో పనిచేసే కూలీల్ని కూడ గట్టాడు. రైతు, కూలీ సంఘాలు పెట్టించాడు.

కూలి రేట్లు పెంచమన్నాడు.

"ఎన్నికల్లా పాల్గొనం" అన్నారు.

కూలీలు ఓట్లెయ్యలేదు.

మాలపల్లిని తగలబెట్టించారు, భూస్వాములు.

రైతు, కూలీ సంఘంలో చేరి చురుగ్గా పన్జేస్తున్నారనే కక్షతో ఓ పేదరైతుని చంపించారు; ఇంకొందర్ని కొట్టించారు, భూస్వాములు.

హరిజన స్త్రీ మీద అత్యాచారం జరిపింది, భూస్వాముల వంశోద్ధారకులు.

నిజం తన కొడుకు వైపుంది.

పేద ప్రజానీకం తన కొడుకు వైపుంది.

కాని, కోర్టులూ, పోలీసులూ, ప్రభుత్వం, అబద్దపు కేసులూ, భూస్వాముల వైపున్నాయి. కనుకనే తీర్పు కూడా భూస్వాముల వైపుంది.

## 13

లోకంలో అన్యాయాలూ, అసమానతలూ, దౌర్జన్యాలూ, దోపిడి చూసి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసినందుకు ఉరి.

ఉరి. ఇంకో గంటలో.

పేద కూలీలతో, రైతులతో కలిసి పోయి, వాళ్ళ బాధలు పంచుకుంటూ, బాధల్నించి విముక్తి కావడానికి వాళ్ళని సిద్ధం చేసినందుకు ఉరి.

ఉరి. ఇంకో గంటలో!

## 14

తెల్లారగట్ట నాలుగైంది.

ఇంకో అరగంటలో అంతా అయిపోతుంది.

ఆ తల్లిని జైలు దగ్గరికి తీసుకెళ్ళడానికి వచ్చిన కొడుకు స్నేహితుడు ఆమెను చేయి పట్టుకొని లేవదీసాడు.

తెల్లవారుతోంది.

జైలు దగ్గరవుతున్న కొద్దీ తల్లి గుండెలు వేగంగా భయంగా కొట్టుకుంటున్నాయి. కళ్ళ వెంట ధారగా కన్నీళ్లు. ఊపిరిలో, కంఠంలో పొంగి పొర్లే దుఃఖం.

జైలు రానే వచ్చింది.

జైలు బయట గుంపులు, గుంపులుగా విద్యార్థులు.

వాళ్ళు ఏవో నినాదాలిస్తున్నారు.

వాళ్ళని ముందుకు రానీకుండా తుపాకులు గురిపెట్టి పోలీసులు బారులు తీర్చి నిలబడ్డారు.

ఆ సమూహాన్ని చేరింది.

గేటువైపు నడవబోయిన ఆ తల్లి, తన కొడుక్కి జోహార్లు అర్పిస్తూ విద్యార్థులు

నినాదాలివ్వడం మొదలు పెట్టగానే. ఆగిపోయింది.

ఇంతలో ఒక రెవరో వచ్చి వినీ వినబడనట్టు "అంతా అయిపోయింది." అన్నాడు.

ఆ తల్లి ఏమీ అనలేదు.

అలా కొంతసేపు జైలు గోడల్లోకి చూస్తూ నిలబడింది.

నెమ్మదిగా వెనక్కి తిరిగింది.

నడుస్తోంది.

ఆమె మనసులోని ఆలోచనలు వేగాన్నందుకున్నాయి.

నిన్న తనుంది. తన కొడుకున్నాడు.

ఇప్పుడు తనుంది. కొడుకు లేడు.

అతని మాటలు వినబడుతున్నాయ్.

అతని చేతులు కనబడుతున్నాయ్.

అతను కూడగట్టిన కూలీలు - పేద రైతులు - వాళ్ళ ఆకలి - పేదరికం - జబ్బులు గొడ్డుచాకిరీ-దోపిడీ-వీటికి వ్యతిరేకంగా వాళ్ళు చేసిన సమ్మెలూ ఆమె కళ్ళలో మెదిలాయి.

దొరలు-వాళ్ళ పెత్తనం- బలహీనుల మీదా,పేదల మీదా వాళ్ళు చేసే దౌర్జన్యం - కూలీల కష్టం మీదా, రైతుల శ్రమమీదా బతుకుతూ అందరికంటే అధికులమని కులికేవాళ్ళ దర్పం- వాళ్ళ చుట్టూచేరి వారి చెప్పుచేతల్లో నడిచే ప్రభుత్వం, పోలీసులూ, కోర్టులూ ఆమెకు జ్ఞాపకం వచ్చాయి.

ఆమె మనసు ఉడుకుతోంది.

ఆమె కళ్ళు మండుతున్నాయి.

ఆమె కొడుకుని ఉరికంబం ఎక్కించింది భూస్వాముల రాజ్యం.

ఆ భూస్వాముల రాజ్యాన్ని ఉరికంబం ఎక్కించడానికి పేదలంతా ఏకమవుతున్నారు.

"కష్టం మాదైతే సుకం దొరదెట్లా?" అంటున్నారు.

వాళ్ళ జీవితాల మీద దొరలు కొట్టే దెబ్బలకి తల వంచక, తిరిగి దొరల పెత్తనంమీద దెబ్బలు కొట్టడం నేర్చుకుంటున్నారు.

వాళ్ళ పోరాటం ముందు దొరలు ఆగరు. జైళ్ళు ఆగవు.

ఉరిశిక్షలూ వాళ్ళ పోరాటాన్ని ఆపలేవు.

తన ఆలోచనల్లోంచి ఆ పోరాటం లోకి నడిచింది ఆ తల్లి - తను ఆ పోరాటానికి ఎలా ఉపయోగపడితే అలా చేద్దామని.

తెల్లవారుతున్న ఆ సమయాన, కొడుకు పనిచేసిన గ్రామానికే బయల్దేరింది ఆ తల్లి, కొడుకు నడిచిన దారినే.

"నిన్న వదలిన పోరాటం
నేడు అందుకొనక తప్పదు."

✸

ప్రజాసాహితి, డిసెంబరు 1977.